ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే విజయుడు

ఎల్వోసీఅం దజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, మార్చి 15: అలంపూర్ మున్సిపాలిటీలో అంబేద్కర్ కాలనీకి చెందిన పరదేశ్ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరై రూ.60వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులైన అనిల్‌కుమార్‌కు ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం అందజేశారు. వారితోపాటు బీఆర్ఎస్ నాయకులు రఘురెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, మైపాల్‌రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

మాట్లాడుతున్నవన పర్తి జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

● జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

వనపర్తి, మార్చి 15 : వేసవిలోసాగు, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు సౌకర్యాలను పకడ్బందీగా చేపట్టాలజెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీస్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖాల ప్రజాప్రతినిధులు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండో స్థాయీ సంఘం సమావేశంలో గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యసేవలు, స్త్రీ శిశు సంక్షేమం పై ఆయా శాఖల అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. శనివారం నిర్వహించాల్సిన స్థాయీ సంఘం సమావేశాన్ని ఈ నెల18వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, జెడ్పీ టీసీలు, జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

● ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రవికుమార్

హక్కులపైఅవ గాహనకల్పి స్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిర వికుమార్

వనపర్తి, మార్చి 15 : వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రవికుమార్ అన్నారు. మండలంలోని చిమనగుంటపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న చెడు ప్రభావం మన పిల్లలపై చూపకుండా తల్లిదండ్రులు శ్రద్ధవహించాలన్నారు. వినియోగదారుల సేవలు పొందేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు, రసీదులను తప్పకుండా తీసుకోవాలన్నారు. వస్తువుల కొనుగోలు విషయంలో మోసపోతే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, ఉత్తరయ్య, తిరుపతయ్య, ఎంపీవో సుదర్శన్, ఎంపీటీసీ ధర్మశాస్త్రి, రామకృష్ణ, కార్యదర్శి శంకర్‌రెడ్డి, రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గద్వాలటౌన్, మార్చి 11 : వినియోగదారుల ప్రయోజం కోసం ఏర్పాటు చేసిన వినియోగదారుల ఫోరాలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆసరా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ కలందర్‌పాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సైబర్ సెల్ అధికారి రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, కో ఆర్డినేటర్ లవీన మంజులత, అధ్యాపకులు వెంకటేశ్, శివారెడ్డి, కృష్ణ మూర్తి, ఆనంద్, ఆసరా జిల్లా అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థి ఎంపిక

రాఘవేంద్రనుఅభి నందిస్తున్న ఉపాధ్యాయులు

ధరూరు, మార్చి 15 : జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ధరూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి రాఘవేంద్ర ఎంపికైనట్లు పీఈటీ శ్రీనివాసులు తెలిపారు. గత యేడాది నవంబర్‌లో మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన రాఘవేంద్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఏప్రిల్ 26 నుంచి 28వరకు మహారాష్ట్రలో జరిగే పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం విద్యార్థి రాఘవేంద్రను హెచ్ఎం ప్రతాప్‌రెడ్డితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ ప్రతిభకనబర్చి జిలాక్లు మంచి పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు.

మోగిన బార్ అసోసియేషన్ ఎన్నికల నగారా

బార్ అసోసియేషన్‌కా ర్యవర్గ ఎన్నికల నోటిఫికేషన్‌విడు దలచేసిన దృశ్యం

వనపర్తి టౌన్, మార్చి 15 : వనపర్తి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికకు ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల పరిశీలకులు ఉత్తరయ్య వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ చాంబర్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, 21న మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్క్రూట్నీ ఉంటుందని తెలిపారు. 22న సాయంత్రం 4గంటల వరకు విత్‌డ్రా, అదే రోజు పోటీలో ఉన్న వ్యక్తుల పేర్లను వెల్లడిస్తారని తెలిపారు. 28న ఉదయం 10నుంచి 2గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని, అదేరోజు 3:15 గంటల నుంచి కౌంటింగ్ జరుగుతుందని, అనంతరం విజేతను ప్రకటిస్తామని చెప్పారు. ఏప్రిల్ 1న నూతన కార్యకర్గం ప్రమాణస్వీకారం ఉంటుందని ఆయన చెప్పారు. సమావేశంలో బార్ అసోసియేషన్ సీనియర్ నాయకులు హేమవర్దన్‌రెడ్డి, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్‌కుమార్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖిల్లాఘణపురం, మార్చి 15 : రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై శుక్రవారం మండలకేంద్రంలోని జిల్లా మత్స్యశాఖ ఉపాధ్యక్షుడు గాండ్ల నరేందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అందుకు కృషి చేసిన కాంగ్రెస్ ఫిషర్మెన్ అధ్యక్షుడు మెట్టు సాయికుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర టౌన్ అధ్యక్షుడు బీసీ నారాయణ, నేతలు గుగ్గిల్ల గోపాల్, బాలస్వామి, యాదయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నైపుణ్యముంటే.. ఏ రంగంలోనైనా రాణించొచ్చు

● వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

● నర్సింగ్ కళాశాలలో ల్యాంప్ లైటింగ్ కార్యక్రమం

జ్యోతిప్రజ్వలన చేస్తున్నకలె క్టర్‌తే జస్‌నందలాల్ పవార్

ల్యాంప్ లైటింగ్ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థినులు, అధ్యాపక బృందంతో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి, మార్చి 15 : నైపుణ్యం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో రెండో బ్యాచ్ ప్రారంభోత్సవం సందర్భంగా ల్యాంప్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ వృత్తి పట్ల శ్రద్ధ, భక్తి, సేవాభావం కలిగి ఉండాలాన్నారు. దవఖానకు వచ్చే రోగి ధనికుడైనా పేదవాడైనా అందరికీ సమానంగా సేవలు అందించాలన్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపడమే కాకుండా జబ్బును నయం చేసే కీలకపాత్ర నర్సులదన్నారు. నర్సింగ్ రంగంలో ఉండేవారి సేవలు ఎంతో ముఖ్యమని కరోనా లాంటి కష్టకాలంలో నర్సుల సేవలు ఎంతో కీలకంగా నిలిచాయని కలెక్టర్ గుర్తు చేశారు. ఏ రంగంలో అడుగు పెట్టినా ఆ వృత్తిలో ఉన్న విలువలను ఆకళింపు చేసుకొని పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పుణికిపుచ్చుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి తరగతి గదిలో నేర్చుకునే విషయాలతో పాటు క్షేత్రస్థాయిలో వెళ్ళి నేర్చుకునే ప్రాక్టికల్ శిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. శిక్షణలో ఉన్నపుడు మనకు ఏదైనా తెలియని విషయం ఉంటే తెలిసిన వారి నుంచి అడిగి నేర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ భాషా నైపుణ్యం కూడా ముఖ్యమని తెలుగుతోపాటు ఇంగ్లిష్ భాషలో నైపుణ్యం సాధించాలని సూచించారు. అదేవిధంగా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్ర ఝాన్సీబాయి, డీపీఆర్వో సీతారాం మాట్లాడారు. అంతకుముందు కలెక్టర్ కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడ్మిన్ విభాగం సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, రవీందర్,అధ్యాపక బృందం ప్రవీణ్, సరస్వతీతోపాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

కవిత అరెస్టు అప్రజాస్వామిక చర్య

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి, మార్చి 15: మహిళ అని కూడా చూడకుండా ముందస్తు సమాచారం లేకుండానే తీవ్రవాది, దేశద్రోహిని అరెస్టు చేసినట్లు ఎమ్మెల్సీ కవితను చేయడం అప్రజాస్వామిక చర్య అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ శుక్రవారం ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు లోపాయకారి ఒప్పందం ప్రకారం అరెస్టులు చేయడం సిగ్గుచేటని అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు

● జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, మార్చి 15 : జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు పోలీస్ శాఖ చేపడుతుందని ఎస్పీ రితిరాజ్ తెలిపారు. కాసం ఫ్యాషన్స్ వారు శుక్రవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు 20 బారికేడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిర్వహణలో పోలీస్ శాఖకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

పిల్లలు నీటి వనరుల వద్దకు వెళ్లొద్దు

పెబ్బేరు, మార్చి 15: ఒంటి పూట బడుల నేపథ్యంలో పాఠశాలలు పూర్తయ్యాక విద్యార్థులు ఇంటి వద్దే చదువుపై దృష్టి సారించాలని పెబ్బేర్ ఎంఈవో జయరాములు సూచించారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఒంటి పూట బడుల సందర్భంగా ఆయన స్థానిక చెంచువాడలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. బడి లేని సమయంలో గ్రామాల్లోని నీటి కుంటలు, చెరువులు, బావుల వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదాలకు లోను కావొద్దని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల పోలింగ్ కేంద్రాలు పరిశీలన

పాన్‌గల్, మార్చి 15 : మండలంలోని బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, వెంగళాయిపల్లి, రాయినిపల్లి, మాందాపూర్, దావూత్యాన్‌పల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తాసీల్దార్ సుభాశ్‌నాయుడు, ఎంపీడీవో కోటేశ్వర్, ఎంపీవో రఘురాములు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గట్టులో పర్యటించిన ఆర్డీవో

గట్టు, మార్చి 15 : గద్వాల ఆర్డీవో రాంచందర్ మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించారు. రైతు వరలక్ష్మి 584సర్వే నెంబర్‌లోని పొలం ఇనాం రద్దుకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో విచారణ నిర్వహించారు. ఆర్డీవో వెంట తాసీల్దార్ సరితారాణి, ఆర్ఐ రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు

ధరూరు, మార్చి 15 : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని గుడ్డెందొడ్డి రోడ్డుపై రెండు బైక్‌లు శుక్రవారం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నెట్టెంపాడు గ్రామానికి చెందిన శేఖర్ తీవ్రంగా గాయపడి, కుడి కాలు విరిగింది. అతడి పరిస్థితి విషమమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉన్నత విద్యలో రాణించాలి

అయిజ, మార్చి 15: విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని ఎస్సై విజయ్ భాస్కర్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పులికల్ జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఎస్సై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కృషి, పట్టుదలతో విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పాఠశాల స్థాయి విద్యలో చక్కటి ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. పదిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహులు, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో రెవెన్యూ కలెక్టర్ పూజలు

కొత్తకోట, మార్చి 15 : పట్టణంలోని దత్తాత్రేయ ఆలయంలో శుక్రవారం రెవెన్యూ కలెక్టర్ నగేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకించిన అనంతరం ఆలయ నిర్వాహకులు వెంకటరమణ శాలువాతో సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మహేందర్, తారకేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్పీ గెలుపునకు కలిసికట్టుగా పనిచేద్దాం

● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మార్చి 15 : బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తులో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రకటించడం హర్షణీయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ఎస్పీ గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, హక్కులు కాపాడుకోవడానికి బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు ఎంతో దోహదం చేస్తుందన్నారు. వందరోజుల కాంగ్రెస్ అసమర్థపాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్దామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలలో రుణమాఫీ, రైతు భరోసా పథకాలు అటకెక్కాయన్నారు. మహిళలకు నెలకు రూ.2500, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి పథకాల ఊసే ఎత్తడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గతంలో 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలను నిర్వహించగా నియామకపత్రాలు అందించి తామే ఇచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటునన్నారు. రాష్ట్రంలో సాగునీళ్లు ఆగిపోయాయని, తాగునీళ్ల కేమో కరువొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రుల మధ్య సమన్వయం లేదని, అంతర్గత కలహాలతో కాంగ్రెస్ సతమతవుతుందన్నారు. మంత్రులు, ముఖ్యమంత్రి పరస్పర విరుద్ధ ప్రకటనలతో ప్రజలను అయోమయంలో పడేస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేండ్లలో పచ్చబడ్డ పాల మూరు, మళ్లీ మొదటికి వచ్చిందని, కాంగ్రెస్ కాలు పెట్టింది.. పాలమూరుకు కరువొచ్చిందన్నారు. కరెంటు కోతలతో రైతులు తల్లడిల్లుతున్నారని అర్ధరాత్రి కరెంటు కోసం పోలాల వద్ద నిద్రించే పరిస్థితిని కాంగ్రెస్ మళ్లీ తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ తెచ్చిన ఈ మార్పులను గడప గడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాల్సి అవసరం ఉందని పార్టీ శ్రేణులకు సూచించారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

● అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, మార్చి 15 : జిల్లాలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీల్లో తాగునీటి సమస్యల పరిష్కారం, ఇతర అంశాలపై జెడ్పీ సీఈవో యాదయ్యతో కలిసి డీఆర్డీవో, డీపీవో శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేతి పంపులు, బోరు బావులకు సంబంధించి మరమ్మతులుంటే ఈనెల 18 తేదీలోగా పూర్తి చేయాలన్నారు. పంపు సెట్ల మరమ్మతుల కోసం నిధులు అవసరమైతే మండల ఇంజి నీర్ల ద్వారా అంచనా తయారు చేసి పంపాలని సూచించారు. జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు సహా పలు మండలాల్లో ఉపాధి కూలీల హాజరు శాతం తక్కువగా ఉందని, దానిని మెరుగు పర్చే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 8గంటలకు ఏపీవోలు ఇతర సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి కూలీలను పెంచే విధంగా పనిచేయాలన్నారు. అలాగే పెద్దమందడి, శ్రీరంగాపురం,వనపర్తి, పాన్‌గల్ మండలాల్లో ఇంటి పన్ను సేకరణ సోమవారం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో ఉమాదేవి, డీపీవో రమణ మూర్తి, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్, డీఎల్‌పీవో రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

● అదనపు కలెక్టర్ నగేశ్

విద్యార్థులనుఅభి నందిస్తున్నఅద నపుకలె క్టర్ నగేశ్

పెద్దమందడి, మార్చి 15 : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని దానికనుగుణంగా చదివి భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. మండలంలోని మోజర్ల గ్రామంలోని 63,64 పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న స్వయంపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు చెప్పే పాఠాలను కూర్చోని విన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు ఉన్నారు.

సాగు, తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి

మాట్లాడుతున్నవైస్ ఎం పీపీచం ద్రశేఖర్

గోపాల్‌పేట, మార్చి 15 : వేసవిలో ప్రజలు , రైతులకు తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ అడ్డాకుల సంధ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులతో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను సభలో చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ మిషన్ భగీరథ తాగు నీటిని ఇంటింటికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, లభ్యత ఉన్నంతవరకు కేఎల్ఐ నీటిని తోడి పొలాలకు సాగునీటిని అందించాలన్నారు. వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు ప్రజా ప్రతినిధులకు సమాచార ఇవ్వడం లేదని ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. పశువైద్యశాలలో పశువులకు అవసరమైయ్యే మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, తాసీల్దార్ శ్రీనివాసులు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాన్‌గల్, మార్చి15 : గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల జాయింట్ చెక్ పవర్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి గ్రామ పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. మండలంలోని కేతేపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్‌పవర్ ఉండేదని, నిధులు డ్రాచేసి పారిశుధ్య కార్మికులు, వాటర్ మెన్స్‌కు జీతాలు ఇచ్చి, తక్కిన నిధులతో ఇతర అభివృద్ధి పనులు చేసేవారని తెలిపారు. ప్రస్తుతం నిధులను డ్రా చేసే పరిస్థితి లేకపోవడంతో జిల్లాలోని 255 పంచాయతీల్లో వందలాది మంది పారిశుధ్య కార్మికుల జీతాల చెల్లింపు ఆగిపోయిందన్నారు. సమావేశంలో డంగు కుర్మయ్య, మద్దిలేటి, కురుమయ్య, ఫకీరు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేయొద్దు

వనపర్తి, మార్చి 15 : డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో డబ్బులు ఇచ్చామంటూ తనపై తప్పుడు ఆరోపణలు చేసే వారిపై పరువు నష్టం దావా వేస్తానని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య సాగర్ అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ పంక్షన్‌హాల్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 ఏడాదిలో చిన్నంబావి మండలంలో డబుల్ బెడ్రూం ఇండ్ల కట్టేందుకు టెండర్ వచ్చిందన్నారు. టెండర్‌లో రూ. కోటి 80 లక్షలకు 20ఇండ్ల నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.75లక్షలు పెట్టి నిర్మించామన్నారు. ఇంతవరకు ఎటువంటి బిల్లు మంజూరు కాలేదన్నారు. కానీ కొంతమంది తనపై తప్పుడు ఆరోపణలు చేస్తు పత్రికల్లో రూ.2.80 కోట్ల అవినీతి చేశారంటూ వార్తలు ప్రచురించడమే కాకుండా తనపై జిల్లా పోలీస్‌కు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. సమావేశంలో ఆంజనేయలు, చిలుక సత్యం సాగర్, చీర్లవిష్ణుసాగర్, సత్యనారాయణ, జనార్దన్ చంద్రాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల తోనే అభివృద్ధి

ఆత్మకూరు, మార్చి 15 : ఇంటి పన్నుల వసూళ్లతోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో పర్యటించిన ఆయన పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. మున్సిపాలిటీలో బిల్లులు పెండింగ్‌లు లేకుండా వసూళ్లు నిర్వహించాలని బిల్ కలెక్టర్లను ఆదేశించారు. ఇంటి పన్నులు కట్టేందుకు నిర్లక్ష్యం చేసే వారి నల్లా కనెక్షన్లు తొలగించేందుకు వెనుకాడకూడదని సిబ్బందికి సూచించారు. నూటికి నూరు శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆస్తిపన్ను వసూలు

అయిజ, మార్చి 15: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేశారు. మున్సిపల్ కమిషనర్ సత్యబాబు పర్యవేక్షణలో రెవెన్యూ, బిల్ కలెక్టర్లు ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఆస్తిపన్ను బకాయిలు అధిక మొత్తంలో ఉన్న ఇండ్ల యజమానులకు అవగాహన కల్పించి పన్నులు చెల్లించేలా చూస్తున్నారు. శుక్రవారం పట్టణంలో వ్యాపార, వాణిజ్య, ఇండ్లకు చేరుకొని పన్నులు వసూలు చేశారు. రూ.1.84 కోట్ల ఆస్తిపన్ను చేయాల్సి ఉండగా, రూ.1.24 కోట్లు వసూలు చేసినట్లు మేనేజర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. రూ.62లక్షల పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈనెల చివరిలోగా ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మేనేజర్ తెలిపారు. వందశాతం పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆస్తిపన్నువసూ లు చేస్తున్న మేనేజర్ రాజేశ్‌కుమార్

ఉపాధిహామీ పనులు పరి